

# నందికేశుడి నోము

పొద్దున్నే అందరం బడి టైం అయిపోతోందని రెడీ అవుతున్నాం. ఆ పాటికే అమ్మ ఓ కంచంలో వేడన్నం మీద ఆవకాయీ నెయ్యీ వేసి అలా ఇలా కలిపేసి నాలుగు భాగాలు చేసి ఎవరి భాగం మీద వాళ్ళకో ఆవకాయ పెచ్చు పెట్టింది. కంచం మధ్యలో వెన్న పూస వేసింది. అలాగే ఇంకో కంచంలో పెరుగన్నం కలిపి అవీ నాలుగు భాగాలు చేసింది. ఎవరు రెడీ అయితే వాళ్లు తినేయచ్చన్నమాట.

ఇంతలోకే సువర్ణవాళ్ల బామ్మగారు ఓ పళ్లెంలో వక్క, రెండు తమలపాకులు, ఓ గులాబీ పువ్వు, ఓ యాపిల్‌కాయీ పెట్టుకుని వచ్చి అమ్మని పీటమీద కూచోమని చెప్పి బొట్టు పెట్టి ఇచ్చి వెళ్లిపోయారు. నాకయితే ఈ ఏలూరి పద్ధతులేవీ అర్థం కావటల్లా! అద్దెకున్న వాళ్లతో పోట్లాడాలి గాని ఇన్ని మర్యాదలు చేస్తారా ఎక్కడన్నా! అదే ముక్క అమ్మ నడిగా. ''అద్దె కున్నాం గదాని ఇవ్వరట్లా! ఇది పువ్వు పండు తాంబూలం నోము. రోజూ ఓ ముత్తయిదువ కిస్తే పుణ్యం. అలా ఏడాదిపాటు చేస్తే ఇచ్చిన వాళ్లకీ పుచ్చుకునే వాళ్లకీ కూడా చాలా మంచిదట'' అని అమ్మ చెప్పింది. అయితే తినేవాళ్లకింకా మంచిదట అన్చెప్పి ఆ

కాయసంచీలో వేసుకున్నా బోయనాల బెల్లులో చిన్నారికి సగం ఇచ్చే ఒప్పందం మీద. ఆ పువ్వు జాగర్తగా పట్టుకెళ్లి వనజ టీచరుకిస్తా! ఆవిడది పెద్ద జడ ఎంత బాగుంటుందో ఈ పువ్వు ఆవిడ తల్లో! ఈ కొత్త స్కూలు ఫరవాలేదు. కానీ కొన్ని పాఠాలు మాకు గుంటూర్లో ఎప్పుడో చెప్పేశారు. అందుకే ఇక్కడ టీచర్లకి పాఠాలు చెప్పడం బాగా వచ్చినట్లనిపిస్తోంది.

ఇంక మా స్కూలు కెదురుగానే నాన్న కట్టించే అమెరికనాస్పత్రి. అమ్మేమో మా కారియరక్కడికే పంపిస్తుంది. సిమెంటు, కంకర, ఇసిక కలిపిన ఘాటుఘాటు వాసనంటే నాకు భలే ఇష్టం. అంతా తడితడిగా చల్లచల్లగా వుంటుంది కదా! అక్కడ పని వాళ్లంతా పెద్దయ్‌గారి అమ్మాయిలని మాకేసి చూస్తుంటే ఎంత బాగుంటుందో! కానీ పాపం నాన్నకి ఒక్క నిమిషం కూడా కూచోడం కుదరదు. రోజంతా కూలాళ్ళతో తిరుగుతూ అరుస్తూ పని చేయించాలి. మా ఇంటికి నాన్న కోసం వచ్చే వాళ్లు కూడా దుమ్ము దుమ్ముగానే ఉంటారు. ఇసకతోలేవాళ్లూ, కంకర ఇటిక తోలే లారీల వాళ్లూ, మేస్త్రీలూ అలా.

అదే మావయ్యగారయితే అందంగా తయారయిపోయి మంచి బట్టలేసుకుని వీధి గదిలో పేద్ద ఆకుపచ్చ బల్ల వెనకాతల మెత్తటి కుర్చీలో కూచుని లావు లావు పుస్తకాల కాయితాలు తిరగేస్తూ వుండడమే. చదవగా నేనెప్పుడూ చూడలేదు. ఎక్కువగా ఏ ఆఫీసుకీ కూడా వెళ్లే పని లేదు. ఆయన కూచునే గది కూడా మా వీధి గదిలానే కిటికీలోనే పువ్వుల తోట. ఆయనెదురుగ్గా రెండు చిన్న బల్లలు, టైపు మిషన్లు. ఇద్దరు ముగ్గురు గుమాస్తా కుర్రాళ్ళు అటు ఇటు తిరుగుతూ, మావయ్యగారు చూస్తున్నపుడు టైపు కొడుతూ వుంటారు. ఒక్క గుమాస్తా తాతగారు మాత్రం మావయ్యగారున్నా లేకపోయినా పుస్తకాల్లోంచి తలెత్తకుండా ఏమిటో బ్రహ్మరాత రాసుకుంటూ వుంటారు. మావయ్య గారి కోసం వచ్చే పెద్ద మనుషులు (బామ్మ గారు చెప్పిన వాళ్లన్నమాట) వీధి వరండాలో పేము కుర్చీల్లో కూచుని పేపర్లు చదువుకుంటూ వుంటారు.

ఎంచక్కా మామయ్య వాళ్లకయితే ఇల్లే ఆఫీసు ఆఫీసే ఇల్లు. ఎప్పటికయినా చేస్తే అలాటు ద్యోగం చెయ్యాలి. బల్లమీదుండే సరికొత్త టెలిఫోనులో ఎవరితోనయినా మాట్లాడాలని నా ఆశ. కానీ ఎలా కుదురుతుంది ? నాకు ఎవరూ తెలియదీ వూళ్లో ! తెలిసినా ఫోను వాళ్లకూడా వుండాలి కదా మరి ! అయినా బయటవాళ్ల పిల్లల్ని ఫోను ముట్టుకోనిస్తారా ! ఆలోచించగా ఓ వుపాయం తట్టింది.

సెలవల్లోనే ఓ రోజు మావయ్యగారు ఆఫీసులో ఏదో చదువుకుంటుంటే నెమ్మదిగా వెళ్లి వెనకాల నిలబడ్డా. ''ఏం సుశీలా ! తెల్ల కాయితాలు కావాలా ?'' అనడిగారు.

''కాయితాలేవీ అక్కర్లేదు కానీ సెలవలు కదా నాకేం తోచడం లేదు. ఏదన్నా పనుంటే

చెప్పండి చేస్తా'' అన్నా. ఆయన నవ్వి ''రోజూ పొద్దున్నే వెంకటలక్ష్మి ఆఫీసు తుడుస్తుంది కదా! దగ్గరుండి అన్నీ దులిపించి తుడిపించు. కూజాల్లో నీళ్లు పారపోయించి కొత్తవి పెట్టించు. ఎవరూ లేనపుడు ఫోను మోగితే ఎత్తి ఆడిటరుగారి ఆఫీసండీ ఎవరు కావాలని అడుగు'' అని నాకు పేద్ద ఉద్యోగం ఇచ్చేశారు. ఈ మాత్రం సందు దొరికితే నే వదుల్తానా ! రోజంతా ఆ చుట్టు పక్కలే తిరుగుతూ వుండేదాన్ని. పార్టీలెవరూ లేనప్పుడు నేనూ ఓ పేము కుర్చీలో కూచుని కాపలా కాయడం. ఎప్పుడు టెలిఫోనులో మాట్లాడనిస్తారా అని ఎదురు చూడ్డం. కానీ గుమస్తా తాత గారా కుర్చీ వదిల్తే కదా ! చివరికో రోజు ఇలా కాదు పననుకుని తిన్నగా అడిగేశా ''తాతగారూ! ఒక్కసారి ఫోన్లో మాట్లాడించరా!'' అని. ఆయన నాలుగు నంబర్లు తిప్పి నా చేతికిచ్చి ''మాట్లాడు! మీరు చేరబోయే స్కూలే!'' అన్నారు. అవతల నించి హలో హలో అని వినిపించింది కాని నాకు భయం వేసి వెంటనే పెట్టేశా. అసలే నేను చేరబోయే స్కూలన్నారు. ఫలానా అమ్మాయని తెలిసి సీటెయ్యకపోతే ! అసలు స్కూలెప్పుడు తెరుస్తారండీ అని అడుగు దాం అనుకున్నా గానీ ధైర్యం చాల్లా ! మళ్లీ ఆ ఫోను జోలికే పోలా నేను.

ఇంతలోకే స్కూలు తెరిచేశారు. కాబట్టి రోజంతా ఆఫీసులో వుండడవ్వా కుదరటల్లా! రోజూ సువర్ణ కోసం వచ్చే రిక్షాలో స్కూలుకెళ్లడం రావడం. ఒకటే స్కూలు ఒకేలా వెళ్లడం ఒకేలా రావడం. గుంటూర్లో అయితే వెనక్కి తిరిగోసారి, ఒంటికాలి మీదోసారి, ఎదురూ బదురూ ఓసారి అలా రోజుకోలా నడిచేవాళ్లం. స్కూల్లో ఏమో తెలిసిన పాఠాలే వినాల్సి రావడం. టీచరేమో ఏదైనా ప్రశ్నడిగినప్పుడు ఆన్సరు తెలిసినా నేను చెయ్యెత్త కూడదని ఆర్డరు. ఇంక ఎంత విసుగో మాటల్లో చెప్పలేం !

ఈవేళ మాత్రం భలే అయిందిలే. రోజులానే స్కూలొదిలే టైంకి రిక్షా అబ్బాయొచ్చి రెడీగా గేటు బయట నించున్నాడు. సువర్ణా చిన్నారీ రిక్షా ఎక్కేశారు కూడాను ! నేనూ ఎక్క బోతుంటే అప్పుడు కనబడ్డారు గేటు పక్కనే పది పదిహేను మంది అన్నిక్లాసుల అమ్మాయిలూ నిలబడి. అలా ఎవరు నిలబడమన్నారో ఈవేళ కనుక్కోపోతే మళ్లీ నాకు రేపెవరు చెప్తారు ? ''ఏంటీ ! మీరంతా ఇక్కడెందుకు నించున్నారూ?'' అనడిగా.

'మేమంతా బ్రాహ్మల పిల్లలం' అన్నారు మహా బడాయిగా.

'అయితే ఏవిటట! మేవూ బ్రాహ్మల పిల్లలవే' అన్నా.

'మావయ్యా! ఇదిగో ఈ పిల్ల కూడా పనికొస్తుంది' అని ఓ అరుపు అరిచింది.

''అమ్మయ్య ఇంకో దానివి దొరికావు. కదలకుండా ఇక్కడే ఉండు!'' అని నా చెయ్యి గట్టిగా పట్టుకుందా పిల్ల. నాకయితే చచ్చే భయం వేసింది. బ్రాహ్మల పిల్లలందర్నీ తీసికెళ్లి

ఎక్కడన్నా చంపేస్తారేమోనని.

"ఏమో! నాకు సరిగ్గా తెలియదు. మా నాన్న బ్రాహ్మలు కాదేమో ! తద్దినాలెందుకంటారు" అని చెయ్యి విడిపించుకోబోయా !

"భయంలేదు పాపా ! మీకు చక్కగా అప్పచ్చులు పెట్టి గంటలో ఇక్కడ దింపేస్తాం! వీళ్లందరూ రావట్లా ! ఇప్పుడే వచ్చేద్దాం" అని ఆయన మా అందర్నీ నడిపించడం మొదలెట్టారు. పరిగెత్తుకెళ్లి చిన్నారితో చెప్పా, "ముఖ్యమయిన పనిమీద బ్రాహ్మలింటికెడుతున్నాను! గంటలో దిగబెడతార్ట. చంద్రావుతో గానీ, నాన్నతోగాని వస్తానని చెప్పు" అని ముందెళ్లే వాళ్లని కలుసుకుని నడవడం మొదలెట్టా!

"అక్కా ! ఏదైనా పువ్వుపండు తాంబూలం నోమా ! ముత్తయిదుల కోసం వచ్చారా?" అనడిగా.

"అలాటిదే. కాకపోతే ఈ నోముకి పిల్లలు కూడా పనికొస్తారు. మా అత్తయ్య ఈవేళ నందికేశుడి నోము నోచుకుంది. సాయంకాలం సూర్యాస్తమయం లోపల అయిదు శేర్ల సాల పరవాన్నం, అయిదు శేర్ల బియ్యం అట్లూ చెల్లాలి కదా ! తీరా చూస్తే పొద్దున్నే అత్తయ్య వాళ్ల చుట్టాలకి మైలొచ్చింది. అందుకని ముప్పై మంది దాకా రావడం కుదరట్లా. ఎవరన్నా స్కూలు పిల్లల్ని కేకేసుకు రమ్మని మావయ్యని పంపింది. పదపద గబగబా నడవాలి" అని నా చెయ్యొదల కుండా నడిచింది. ఎన్నో సందులు తిరగ్గా తిరగ్గా వాళ్లదో పెంకుటిల్లొచ్చింది.

అక్కడో ఇద్దరు అడవాళ్లు మమ్మల్ని చూడగానే కాళ్లు కడుక్కు రండమ్మా అని నూతి దగ్గరికి పంపించారు. వరసగ్గా వరండాలో కూచోపెట్టారు. హోటల్లో లాగా ఒకళ్లొచ్చి చిన్న చిన్న కుట్టు డాకులూ పక్కనే దొన్నెలు పెట్టి మంచినీళ్ల గ్లాసులు పెట్టి నీళ్లుపోసి వెళ్లిపోయాడు. ఇంకో ఆయనొచ్చి కొంచెం కొంచెం పెట్టించుకోవాలి. ఇది ప్రసాదం. పారెయ్యకూడదంటూ పరవాన్నం దొన్నెల్లో పోసివెళ్లిపోయాడు. ఆయనవెనకాలే ఒకావిడ పెద్దపళ్లెంలో తెల్లటి అట్లు నాన్న మంచం మీద దోమ తెరలా చిల్లులు చిల్లులుగా పల్చగా వున్నవి ఒక్కో ఆకులో రెండేసి వేసుకుంటూ పోయింది. ఆకులేసినాయనే మళ్లీ వచ్చి అల్లం పచ్చడి నెయ్యి తెచ్చి వేసి వెళ్లి పోయాడు. అంతా ఎవరి పని వాళ్లు చేసుకుంటూ వెళ్లిపోడవే ! మేం కూడా కబుర్లు చెప్పు కోకుండా తినగలిగినంత గబగబా తినేయాలన్నమాట. చీకటిపడేటప్పటికి అట్లుగాని మిగిలి పోతే ఈ నోము ఫెయిలయిపోయినట్లే! ఈ నోము పాసయిపోతే ఆవిడ మళ్లీ ఏకాదశికి శనగలు చలివిడి చేసుకుంటుందిట.

ఈసారి ముందే చెప్తానంది ఆ ఫిప్తుఫారం అక్క. తీపొక్కటే చేస్తే చెల్లదని ఒక తీపి ఒక కారం కలిపి చేస్తారటెప్పుడూనూ ! ఇక్కడికి రాబట్టే కదా నాకు తెలిసిందీ అట్లుమీద నెయ్యేసు

కోవాలని ! అందరికీ అరటిపండు తాంబూలం ఓ అర్ధణా దక్షిణా ఇచ్చి అన్నమాట ప్రకారం స్కూలు దగ్గర దిగబెట్టేశారు. తీరా చూస్తే మా రిక్షా అబ్బాయక్కడే కనబడ్డాడు బీడీ కాల్చు కుంటూ!

''అమ్మాయి గోరూ ! తవర్నింటికొచ్చేమన్నారు మన రిచ్చాల ! అయ్‌గారు మార్కెటు కెల్లి నారంట'' అని చెప్పి నన్నెక్కించుకుని ఇంటి దగ్గర దింపేశాడు.

నిమ్మళంగా రహస్యంగా ఇంట్లోకొచ్చా ! అమ్మచూసింది కానీ ఏం మాట్లాడలేదు. నే ఎక్కడికెడితే అక్కడ్నుంచి వెళ్లిపోవడం. ఎంత కోపంగా వుందంటే కనీసం కాళ్లు కడుక్కోలేదేం అని కూడా తిట్టలేదు. నాన్నొచ్చే లోపల చంపేసినా చంపేయగలదు ! చిన్నారి నడిగా 'ఏం మోశావే నా మీదా ?' అని ! 'మోసేందుకు నాకేం పని ! నువ్వు చెప్పిందే చెప్పా ! బ్రాహ్మలిళ్లకెవరింటికో పిల్లలందరితో పోయింది గంటలో వస్తుందిటా అని' చిన్నారి మహా ఖుషీగా చెప్పింది. మరి ఇంత మాత్రానికే ఎందుకట అంత కోపం ! తాను మాత్రం పొద్దున్న బామ్మ గారు తాంబూలం ఇస్తే తీసుకోలా పెద్ద ముత్తయిదులా పోజుగా !

''ఏంటమ్మా ! నేనేదో వెధవపనులు చేసొచ్చినట్లు కోపంగా ఆ చూపులేంటీ ! ఎప్పుడన్నా నువ్వే ఓ నందికేశుడి నోం చేసుకున్నావనుకో ! మీ చుట్టాలందరికీ మైలొచ్చిందనుకో ! మరి నీ నోము పాసవాలంటే నేను మా స్కూలు నించి బ్రాహ్మల పిల్లలందర్నీ ఏరి తేవాలా వద్దా ? ఎవరన్నా అడిగితే తినిపెట్టడం కూడా మహాపాపమేనా ? ఇదే తప్పయితే ఈ నోము చెయ్యమని పరమేశ్వరుడు వెండికొండ మీద పార్వతీదేవికెందుకు చెప్పాడు ? నాకు నీ చిన్న కూతురి మల్లే గుడిపాములా పడుండడం చేతకాదు. ఇంక నీ మొహం నీ ఇష్టమొచ్చినంత కోపంగా పెట్టుకో! నేను నీకేసి చూస్తే కదా నాకు తెలిసేది'' అని నేనే పోట్లాట మొదలు పెట్టా.

''ఎంత నోములైతే మాత్రం ముక్కు మొహం తెలియని వాళ్లిళ్లకెళ్లిపోయి తినేయడమేనా?''

''ఒక్కసారి కూడా వెళ్ళకుండా వూరందరూ తెలియడానికి నేనేమయినా గాంధీగారినా, నెహ్రూ గారినా ! వెళ్లబట్టే గదా ఫిఫ్త్ ఫారం చదువుతున్నా ఇంతకూడా గర్వం లేకుండా వసంతక్క నాకు రెండు పాటలు నేర్పిస్తానంది!''

''ఏడిశావులే ! ప్రతిదానికీ వూరు పట్టని కథలు చెప్తావు. వసంతక్కట వసంతక్క ! ఎక్కడి చుట్టరికం ! మొండిదాన్ని మొగుడేం చేస్తాడు సిగ్గులేని దాన్ని శివుడేం చేస్తాడని పెద్దవాళ్లూరికే అన్నారా'' అని అమ్మ తన పనిలో పడిపోయింది. అమ్మచేత హాయిగా తిట్లు, తినేశాక నేనాడు కోడానికి పార్కుకెళ్లిపోయా !